రామంజాపూర్‌లో కుటుంబ సమగ్ర సర్వే


సర్వే నిర్వహిస్తున్న బృందం

శంషాబాద్ రూరల్: మండలంలోని రామంజాపూర్‌లో సోమవారం ఫార్మసీ మహావిద్యాలయం బృందం హౌస్ హోల్డ్ సర్వే చేపట్టింది. నగరంలోని సరోజినీ నాయుడు వనిత ఫార్మసీ విద్యాలయ విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించారు. భారత్ అభియాన్ పథకంలో భాగంగా ఈ సర్వే నిర్వహించారు. స్థానిక సమస్యలు, కుటుంబ సమగ్ర వివరాలు సేకరించారు. ఈ సర్వే ఆధారంగా గ్రామాభివృద్ధికి ప్రణాళిక రూపొందించేందుకు వీలు కలుగుతుందని వారు తెలిపారు. సర్వేకు సహకరించిన స్థానికులు మహేష్‌కుమార్, అనిల్, శ్రీశైలం , లోకేష్, అభినయ్, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

శంషాబాద్‌లో ఘనంగా ఉర్సు



శంషాబాద్: పట్టణంలోని హమీదుల్లానగర్‌లోని హజ్రత్‌సయ్యద్ అమానుల్లా షా ఖాద్రీ దర్గా ఉర్సు ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానికులు ఉర్సులో పాల్గొని దర్గాలో చాదర్‌లు సమర్పించి ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఉర్సు ఉత్సవం వద్ద మహ్మద్ మహబూబ్ ఖాద్రీ, మహ్మద్ ఫసియుద్దీన్, మహ్మద్ సల్మాన్‌లు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేయించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహ్మద్ రిజ్వాన్ అహ్మద్, డాక్టర్ మహ్మద్‌జీషాన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


కొలన్ సుభాష్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రజలు

అత్తాపూర్: తన సొంత నిధులతో శ్మశానవాటికకు గేటును ఏర్పాటు చేయించామని మాజీ కో ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ సీనియర్ నేత కొలన్ సుభాష్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు, హైదర్‌గూడవాసులు ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... శ్మశానవాటికకు గేటు లేనందున ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. స్థానిక నేతలు మొండ్ర కొమురయ్య, బండారు రమేష్, మ్యాడం రామేశ్వర్‌రావు, సోమారం రవీందర్, సోమారం రాజ్‌కుమార్, వనం నర్సింహ, బీట్కూరి హరినాథ్, కోలం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ నవ యువ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్ చౌరస్తాలో సోమవారం పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. అమరవీరుల స్థూపం చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ... పోలీసులు వారి కర్తవ్యంలో భాగంగా ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సమాజానికి సేవలు అందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఏర్వకుమార్, ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డి ,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో గుర్రపు డెక్క తొలగింపు


నెక్నాంపూర్ చెరువులో గుర్రపు డెక్కను తొలగిస్తున్న సిబ్బంది

మణికొండ: చెరువులో గుర్రపు డెక్క పెరిగి దోమల వ్యాప్తికి కారణం అవుతున్న నేపథ్యంలో దాన్ని తొలగించే పనులను చేపట్టారు. మణికొండ మున్సిపాలటీ పరిధిలోని నెక్నాంపూర్ పెద్ద చెరువులో ఇటీవల పెద్ద ఎత్తున గుర్రపు డెక్క విస్తరించింది. దాంతో అందులో విపరీతంగా దుర్గంధం, దోమల వ్యాప్తికి కేంద్రంగా మారింది. అదే తరహాలో చిన్న చెరువు కూడా తయారైంది. ఇటీవల చిన్న చెరువులో మణికొండ మున్సిపాలిటీ సిబ్బందితో గుర్రపు డెక్కను తొలగించారు. పెద్ద చెరువులో ఎక్కువగా ఉండటంతో జీహెచ్ఎంసీ నుంచి గుర్రపు డెక్కను తొలగించే వాహనాన్ని రప్పించి సోమవారం నుంచి దాన్ని తొలగించే పనులను చేపట్టారు. దాంతో చుట్టు పక్కల నివాసితులు తమకు దోమల బెడదను నివారించేందుకు మున్సిపాలిటీ అధికారులు చేపట్టిన పనిని అభినందించారు.

నియామకం

రాయదుర్గం: వెస్ట్ వర్జీనియా యూనివర్సిటీలో విజిటింగ్ ఫెలోగా ప్రొఫెసర్ అజైలియునియుమాయ్ నియమితులయ్యారు. అక్టోబర్‌లో వెస్ట్‌వర్జీనియా యూనివర్సిటీ సోషియాలజీ అండ్ ఆంత్రోపాలజీ విభాగంలో విజిటింగ్ ఫెలోగా విజిటింగ్ ఫెలో పాత్రను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త, సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ మాజీ హెడ్ విధులను నిర్వహించి ప్రస్తుతం సీనియర్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. ఈశాన్య భారతదేశంలోని మణిపూర్‌లో మానవ అక్రమ రవాణా యొక్క ఖండనపై బహిరంగ ఉపన్యాసం అందించారు. అంతేకాక పలు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేక ఉపన్యాసం చేశారు.

ప్రత్యేక పూజలు

రాయదుర్గం: సంకష్ట హర చతుర్థిని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ఆలయంలోని అర్చకుల వేద మంత్రోచ్చారణల నడుమ గణేషుడికి ప్రీతిపాత్రమైన 8 కిలోల బెల్లం ముద్దలు, గరకతో ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. షిర్డీసాయిబాబా, కాశీవిశ్వేశ్వరస్వామి,అన్నపూర్ణాదేవి, ఆంజనేయుడు, కాళభైరవుడికి ప్రత్యేక అ ర్చనలు, పూజలు, అభిషేకాలు, అలంకారం చే శారు. వాసిరెడ్డిపార్వతి, భక్తులు పాల్గొన్నారు.

బండ్లగూడ వీధి విక్రయదారుల మార్కెట్‌లో...

రెచ్చిపోతున్న అసాంఘిక శక్తులు!

నిర్మించింది 40 స్టాల్స్..

- వినియోగంలో నాలుగు మాత్రమే
- మిగిలిన వాటిలో ఇష్టారాజ్యంగా మందుబాబులు
- జూదం ఇతర కార్యకలాపాలు
- పట్టించుకోని అధికారుల తీరుపై సర్వత్రా నిరసన


ఖాళీగా ఉన్న స్టాల్స్

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాళీమందిర్ సమీపంలో నిర్మించిన పట్టణ వీధి విక్రయదారుల సమీకృత మార్కెట్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. నిరుపయోగంగా ఉండటంతో అదికాస్తా మందుబాబులు, జూదరులకు నిలయంగా మారింది.

- మార్కెట్‌ను 2020 అక్టోబర్‌లో రూ. 30 లక్షల పట్టణ ప్రగతి నిధులతో నిర్మించారు. 40 స్టాల్స్ నిర్మించారు. ఆయా స్టాల్స్‌ను డ్రా పద్ధతిలో అర్హులైన లబ్ధిదారులకు కేటాయించారు.
- ఇదంతా ఒక ఎత్తయితే.. ప్రస్తుతం వ్యాపారులు వాటిలో తమ వ్యాపార కార్యకలాపాలను చేయడం లేదు. ఇది అసాంఘి శక్తులకు వరంగా మారింది. స్థానికంగా ఉన్న ఆవారాగా తిరిగే కొందరు ఆయా స్టాల్స్‌లలో తమ అసాంఘిక కార్యకలాపాలను కొనసాగితస్తున్నారు.


ఖాళీ స్టాల్‌లో పేకాట ఆడుతున్న దృశ్యం

కళా విహీనంగా మార్కెట్...

ప్రదాన జాతీయ రహదారి పక్కనే కార్పొరేషన్ ప్రజలకు అందుబాటులో ఉంటుందని అధికారులు 40 స్టాల్స్‌ను నిర్మించారు. నామమాత్రం రుసుముతో లబ్ధిదారులకు షాపులను కేటాయించినా వాటిలో వ్యాపారాలను కొనసాగించలేక పోయారు. దీంతో ఆయా స్టాల్స్ కాస్తా ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన స్టాల్స్ నిరుపయోగంగా ఉండటం.. కొందరు వాటిలో మద్యం సేవిస్తూ.. పేకాట ఆడుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతపై పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు స్టాల్స్‌లోనే వ్యాపారాలు...

మార్కెట్‌లో 40 స్టాల్స్‌ను నిర్మించి వాటిని అర్హులైన వారికి కేటాయించినా అందులో ముందు వరసలో ఉన్న నాలుగు స్టాల్స్‌లలో మాత్రమే వ్యాపారాలు కొనసాగిస్తుంటారు. మిగతా 36 స్టాల్స్ అన్నీ ఖాళీగానే ఉంటాయి. వాటిలో పేకాట ఆడుతూ, గుట్కాలు తింటూ ఎక్కడ పడితే అక్కడ ఉంచుతూ మార్కెట్‌ను చెత్త కుప్పగా మారుస్తున్నారు. దీనిపై అధికారులు తగు చర్యలు చేపట్టి వ్యాపారాలు చేసుకునే వారికే స్టాల్స్‌ను కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.

వెనక్కు తీసుకుంటాం...



"పట్టణ వీధి విక్రయదారుల సమీకృత మార్కెట్‌లో స్టాల్స్ కేటాయించిన లబ్ధిదారులు అందులో వ్యాపారాలు కొనసాగించాలి. అలా చేయని వారిపై తగు చర్యలు తీసుకుంటాం. నెల క్రితం వారితో మాట్లాడాం. వారికి కేటాయించిన స్టాల్స్‌లలో వ్యాపారాలు జరపకుంటే మంజూరు పత్రాలు వెనక్కి తీసుకుంటాం.

– శరత్‌చంద్ర, కమిషనర్, బండ్లగూడ జాగీర్

యువ సంఘంలో చేరేందుకు 25 వరకు అవకాశం

రాయదుర్గం: భారత ప్రభుత్వంలోని విద్యా మంత్రిత్వ శాఖ యువ సంఘం (5వ దశ) కోసం పేర్లను నమోదు చేసుకునేందుకు అక్టోబర్ 25వ తేదీ వరకు అవకాశం కల్పించారు. తెలంగాణ విద్యార్థులకు అవకాశం కల్పించారు. 18 నుంచి 30 ఏళ్ల లోపు వయస్సు గల యువకులు ఇందులో పాల్గొనడానికి అవకాశం ఉంది. యువ సంఘం కార్యక్రమం యువ సంఘం పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవచ్చు. తెలంగాణ రాష్ట్రంలో యువ సంఘం(5వ దశ) కార్యక్రమాలను నిర్వహించడానికి విద్యా మంత్రిత్వ శాఖ మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని నోడల్ విశ్వవిద్యాలయంగా నామినేట్ చేసింది. ఇప్పటికే నాలుగు దశల యువ సంఘం కార్యక్రమం పూర్తయింది. ప్రస్తుతం అయిదవ దశ ప్రారంభించారు ఈ దశలో హిమాచల్‌ప్రదేశ్‌లోని హమీర్‌పూర్‌లోని ఎన్ఐటీతో కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని జత చేసింది.ఇది ప్రధానంగా ఉన్నత విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థులు, ఒక రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలు, ఇతర రాష్ట్రాలకు, కొంత మంది క్యాంపస్ యువకులతో కూడిన ఎక్స్‌పోజర్ టూర్‌లను నిర్వహించడంపై దృష్టి పెడుతుంది.

హెచ్ఐవీ వైరస్‌పై అవగాహన సదస్సు



గోల్కొండ: హెచ్ఐవీ వైరస్ ఆరోగ్యానికి కాకుండా సమాజానికి కూడా హానికరమని గోల్కొండ ఏరియా ఆసుపత్రికి చెందిన రుక్సానా అన్నారు. శనివారం గోల్కొండ బీజేఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారు హెచ్ఐవీ వైరస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హెచ్ఐవీని సమూలంగా నిర్మూలించేందుకు ప్రభుత్వం ధృడనిశ్చయంతో ఉందన్నారు. ఇందులో భాగంగా సమాజంలోని ప్రతి ఒక్కరికి వ్యాధి నియంత్రణ, వ్యాప్తి, ఆరోగ్య సమస్యలు తదితర వాటిపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల విద్యార్థినులు హెచ్ఐవీ వైరస్‌పై వల్ల ప్రమాదాలను తమ పరిసరాల్లోని వారికి వివరించాలన్నదే తమ లక్ష్యమని ఆమె అన్నారు. ప్రిన్సిపాల్ జి.మాధవి మాట్లాడుతూ..ఎయిడ్స్ నివారణ సంస్థకు ప్రతి విద్యార్థి ముందుకు వచ్చి అంబాసిడర్లుగా మారాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణ సంస్థకు చెందిన దిలీప్‌కుమార్, కళాశాల అధ్యాపకులు ప్రణీత, ముబీనా, హర్షియా, రిజ్వానా, మసుద ఉన్నారు.

అత్తాపూర్‌లో సమస్యలు పరిష్కరించండి

అత్తాపూర్: అత్తాపూర్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ పార్టీ డివిజన్ సీనియర్ నాయకుడు అప్పారెడ్డి ముఖేష్ కోరారు. అత్తాపూర్ డివిజన్‌లోని పిల్లర్ నెంబర్ 122 నుంచి అత్తాపూర్ గ్రామంలోకి వెళ్లే దారిలో రోడ్లు, డ్రైనేజీ సరిగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్‌ను కలిసి సమస్యలను ఆయనకు వివరించామన్నారు. దీనికి స్పందించిన డీసీ ఇంజినీరింగ్ ఈఈ నరేందర్‌గౌడ్, ఏఈకి అత్తాపూర్‌లోని రోడ్ల ప్యాచ్‌వర్క్‌లు చేపట్టాలని.. కొత్త రోడ్ల నిర్మాణానికి టెండర్లు రూపొందించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్యేపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి


చైర్మన్‌ను కలిసిన నరేందర్

శంషాబాద్: గత బీఆర్ఎస్ పాలనలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ప్రోద్బలంతో పోలీసులు, మున్సిపాలిటీ అధికారులు దళితుడైన తన డెయిరీ నిర్మాణాన్ని అన్యాయంగా కూల్చివేశారని పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఢిల్లీలో జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిశోర్ మక్వానాకు వివరించారు. ఉపాధి కోసం తాను నిర్మించుకున్న డెయిరీ కట్టడాన్ని కూల్చివేతకు ప్రధాన కారణమైన ఎమ్మెల్యేపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. బాధ్యులైన ప్రభుత్వాధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. జాతీయ ఎస్సీ కమిషన్‌లో ఇప్పటికే ఉన్న తన ఫిర్యాదును పరిశీలించి ప్రత్యేక కమిషన్ ద్వారా విచారణ చేయాల్సిందిగా ఆయన కోరారు. ఆయనతో పాటు జాతీయ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు విజయ్‌కుమార్ ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

గోల్కొండ: ఈ నెల 23 నుంచి కార్వాన్‌లో పరిశుభ్రతపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో పరిశుభ్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరిశుభ్రత, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజల సహకారం ఉంటేనే రోగాల వ్యాప్తిని అరికట్టవచ్చునన్నారు. బల్దియా, జలమండలి అధికారుల సమన్వయంతో ఈ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రజలు సైతం తమవంతు సహకారం అందించాలని, దీనిపై మజ్లిస్ నాయకులు, కార్పొరేటర్లు ముందుగానే ప్రజలకు తెలియజెప్పి వారి సహకారం కూడా తీసుకోవాలని ఆయన సూచించారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు అలీముద్దీన్, హబీబ్‌చౌష్ తదితరులున్నారు.

'సామాజిక మాధ్యమాల్లో వచ్చే పుకార్లను నమ్మొద్దు'


మాట్లాడుతున్న ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ నాగదుర్గా ప్రసాద్

గౌలిపురా: సామాజిక మాధ్యమాల్లో వచ్చే పుకార్లను ప్రజలు నమ్మొద్దని ఛత్రినాక ఏసీపీ సీహెచ్. చంద్రశేఖర్ సూచించారు. మొఘల్‌పురా పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన పీస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఎలాంటి పోస్టులను కూడా ప్రజలు వైరల్ చేయకూడదన్నారు. ఒకవేళ ఇతరులకు షేర్ చేస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బస్తీలు, కాలనీలు అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని.. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



శంషాబాద్: ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మరణించాడు. పోలీసుల సమాచారం మేరకు... పట్టణం మార్కెట్ ప్రధాన రహదారిలోని టైబజార్ వద్ద ఓ వ్యక్తి పడి ఉన్నాడు. స్థానికులు ఆర్‌జీఐఏ పోలీసులకు సమాచారం అందించారు. అతడు సమీపంలోని వైన్స్ నుంచి వచ్చినట్లు గుర్తించారు. మరణించిన వ్యక్తికి సుమారు 35 సంవత్సరాల వయసు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ఆర్‌జీఐఏ పోలీసులను సంప్రదించాలని కోరారు.

'దేవునికుంట శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పిస్తా'


శ్మశానవాటికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్, నాగేష్ తదితరులు

విజయనగర్‌కాలనీ: దేవునికుంట హిందూ శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పిస్తానని నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక నాయకుడు నాగేష్‌తో కలిసి సందర్శించారు. దీపావళిని పురస్కరించుకొని శ్మశానవాటికలో ప్రజలు పెద్ద ఎత్తున తమ పూర్వీకుల సమాధులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని, వారికి ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా పనులు పూర్తి చేస్తామన్నారు. శ్మశానవాటికలో విధులు నిర్వహించే నాగరాజు ఇక్కడ నెలకొని ఉన్న స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీపావళి నాటికి చెట్లకొమ్మలు, పనికిరాని చెట్లు తొలగించాలని ఈఈ లాల్‌సింగ్‌కు సూచించారు.

'ప్రజావాణి' ఫిర్యాదులపై సత్వర స్పందన

రాజేంద్రనగర్ డీసీ రవికుమార్


డీసీకి ఫిర్యాదు చేస్తున్న ముష్క్ మహల్ డెసిడెట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఏడు ఫిర్యాదులు అందినట్లు డిప్యూటీ కమిషనర్ రవికుమార్ తెలిపారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు పాల్గొని వివిధ సమస్యలపై ఏడు ఫిర్యాదులను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ కుమార్ మాట్లాడుతూ... ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను పరిశీలించి సంబంధింత అధికారులకు పంపించి వాటి సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముష్క్ మహల్ డెసిడెట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

అత్తాపూర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ముష్క్ మహల్ డెసిడెట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతినిధులు డీసీ రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. హుడా కాలనీలోని హుడా పార్కులో వాకింగ్ ట్రాక్, మారుతీనగర్, పాండు రంగానగర్‌లలో వీధి దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జైహింద్ రెడ్డి, శివ కుమార్, మారుతీరావు, చెన్నయ్య, శంకర్, నాగ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు స్టార్ హోటల్ భోజనం


విద్యార్థులకు భోజనాన్ని అందించిన గోల్కొండ రిసార్ట్స్ టీం సభ్యులు

మణికొండ: వారంతా ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారు. రోజూ మధ్యాహ్నం ప్రభుత్వం ఏర్పాటు చేసిన భోజనాన్ని తింటారు. అందుకు భిన్నంగా సోమవారం వారంతా ఏకంగా ఫైవ్ స్టార్ హోటల్ భోజనాన్ని తిన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గండిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న 240 మంది విద్యార్థులకు గోల్కొండ రిసార్ట్స్ చైర్మన్ రామిరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బిర్యానీ, పలు రకాల వంటకాల భోజనాన్ని అందించారు. దాంతో విద్యార్థులు ఆనందంగా భోజనాన్ని ఆరగించి జన్మదినోత్సవాన్ని జరుపుకొంటున్న రామిరెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా గోల్కొండ రిసార్ట్స్ ఆపరేషన్స్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... తమ వంతు సేవా కార్యక్రమాలలో భాగంగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, గండిపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అనేక సౌకర్యాలను కల్పించాలమన్నారు. జనరల్ మేనేజర్ రమేష్, ఫైనాన్స్ మేనేజర్ సీహెచ్. శ్రీనివాస్‌లతో పాటు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ. కోట్ల విలువైన ప్రభుత్వ భూముల కబ్జాపై ఫిర్యాదు

శంషాబాద్: పట్టణంలోని సర్వేనంబర్ 626బై1లో కోట్లాది రూపాయల ప్రభుత్వ భూముల ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ రవీందర్‌దత్ తెలిపారు. హెచ్ఎండీఏకే కేటాయించిన ఈ స్థలంలో సమీపంలో ఉన్న వెంచర్ నిర్వాహకులతో పాటు కొందరు కబ్జాకు యత్నిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. రెండేళ్ల కిందటే సదరు స్థలాన్ని కబ్జాలోకి తీసుకున్నట్లు రెవెన్యూ అధికారులు నిర్వహించిన సర్వేలో తేల్చారు. హెచ్ఎండీఏకు కేటాయించిన ఈ స్థలంలో కొందరు ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతల అండదండలతో కబ్జా పర్వం కొనసాగుతున్నదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2022లో రెవెన్యూ అధికారులు చేపట్టిన సర్వేలో మొత్తం 5.17 ఎకరాల స్థలం పక్కనే ఉన్న ఓ వెంచర్ నిర్వాహకుల ఆధీనంలో ఉన్నట్లు జిల్లా కలెక్టర్‌తో పాటు హెచ్ఎండీఏ, మున్సిపాలిటీ అధికారులకు రెవెన్యూ అధికారులు నివేదికను అందించారు. హెచ్ఎండీఏ స్థలాన్ని కొందరు వ్యక్తులు తమదిగా పేర్కొంటూ చేస్తున్న ఈ తంతంగంపై అధికారులు లోతైన విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. హెచ్ఎండీకు చెందిన ఓ మాజీ అధికారి ఈ కబ్జా తతంగాన్ని నడుపుతున్నట్లు ఆరోపిస్తున్నారు. గతంలో సింప్లెక్స్ సమీపంలోని హెచ్ఎండీఏ భూములను కాజేసేందుకు చేసిన చర్యల్లానే ప్రస్తుత వ్యవహారం కొనసాగుతోందన్నారు. దీనిపై సర్కారు దృష్టి సారించి సుమారు రూ. 60 కోట్ల విలువైన స్థలాన్ని కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి


ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న బల్దియా అధికారులు

చార్మినార్: ప్రజావాణిని పాతబస్తీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న కోరారు. ప్రతి సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రజావాణి కొనసాగుతుందన్నారు. దాదాపు రెండున్నర గంటల పాటు అధికారులు ఫిర్యాదుల కోసం ప్రజావాణిలో ఉంటారని.. తమ ఫిర్యాదులను అందజేయవచ్చునన్నారు. ప్రజావాణిలో తమకు అందిన ఫిర్యాదులను సంబంధిత విభాగాల అధికారులతో పరిష్కరించడానికి కృషి చేస్తున్నామన్నారు.

ఈసారి 6 ఫిర్యాదులు..

గత సోమవారం 14న, ఒక్క ఫిర్యాదు కూడా అందని విషయం తెలిసిందే. అయితే ఈ సోమవారం మాత్రం 6 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. తన పర్యవేక్షణలో ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాతబస్తీ నర్కిపూల్ బాగ్‌లోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో ప్రజావాణి కొనసాగుతుందని జోనల్ కమిషనర్ వెంకన్న తెలిపారు. ఈ సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో చార్మినార్ జోన్ ఏఎంసీ రాజారావు, ఎలక్ట్రికల్ విభాగం ఈఈ రామారావు, మేనేజర్(యూబీడీ) రఘునాథరెడ్డి తదితరులు పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు.

శ్మశాన వాటికకు విద్యుత్ స్తంభాలు మంజూరు


విద్యుత్ స్తంభాలకు పూజలు నిర్వహిస్తున్న కాశమోని శ్యాంరావు ముదిరాజ్ తదితరులు

చాంద్రాయణగుట్ట: నల్లవాగు హిందూ శ్మశాన వాటికలో వీధి దీపాల ఏర్పాటుకు సంబంధించి పది విద్యుత్ స్తంభాలు మంజూరు చేయడం హర్షణీయమని గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యాంరావు ముదిరాజ్ అన్నారు. ఈ మేరకు విద్యుత్ స్తంభాలకు బ్యాగరీ సంఘం నాయకులతో కలిసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్మశాన వాటికలో దశలవారీగా సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. తాము విన్నవించిన వెంటనే అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ బ్యాగరీ సంఘం అధ్యక్షుడు పేరోజీ సాయినాథ్, ప్రతినిధులు సాయిలు, జయలక్ష్మీ, సత్తెమ్మ, సురేందర్, వీరేందర్, భగీరథ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానం చేసిన వారిని సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎంజేపీ మిల్క్ ప్రొడక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ గౌస్ అన్నారు. గత వారం గోల్కొండ జ్యూరిచ్ పాఠశాలలో సికిల్ సెల్ సొసైటీ వారు నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న వారికి సోమవారం ఆయన ప్రశంసాపత్రాలు అందించారు. ఆయన మాట్లాడుతూ..రక్తదానం చేసిన వారిలో 50 శాతం కంటే పైగా యువకులే ఉన్నారన్నారు. స్థానికుల నుంచి వచ్చిన స్పందనను దృష్టిలో పెట్టుకొని మునుముందు మరిన్ని రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామన్నారు. సీనియర్ మజ్లిస్ నాయకులు ఏ.కే.పటాన్, తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్, మునావర్ తదితరులున్నారు.